10 కేజీల గంజాయితో ముగ్గురు నిందితులు అరెస్టు

విశాలాంధ్ర-సీలేరు : ఒడిశా నుంచి సీలేరు మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న 10 కేజీల గంజాయితో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని సీలేరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. సోమవారం సీలేరు మారెమ్మ ఆలయం వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలతో ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా ఈ గంజాయి పట్టుబడిందన్నారు. దీంతో బైకులపై వచ్చిన సీలేరు దుర్గావీధికి చెందిన మండి శిరామ్(28), చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముదిలిగూడుకు చెందిన పాంగి సునీల్(18), నెల్లూరుకు చెందిన దక్షిణకుమార్ అను ముగ్గురు నిందితులను అదుపులో తీసుకొని వారి వద్ద రెండు బైక్‌లతో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ.600 నగదు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యం

చింతపల్లి, జికే వీధి జడ్పీటీసీలు బాలయ్య, శివరత్నం, ఎంపీపీలు అనూష దేవి, కుమారి

విశాలాంధ్ర-చింతపల్లి : ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా చలో విజయవాడ ప్రయాణమై వెళ్తున్నట్లు చింతపల్లి, జీకే వీధి జెడ్పిటిసిలు పోతురాజు బాలయ్య, కిముడు శివరత్నం, ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి లు అన్నారు. వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని వైకాపాకు చెందిన ఇద్దరు జడ్పిటిసి లతోపాటు, 24 మంది ఎంపీటీసీలు మంగళవారం చలో విజయవాడ ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా జెడ్పిటిసిలు, ఎంపీపీలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చలో విజయవాడ బయలుదేరి వెళ్లడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో తమ పార్టీ పరాజయం పాలైనప్పటికీ ఎమ్మెల్సీ స్థానాన్ని తమ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ఈ సందర్భంగా వారు దీమా వ్యక్తం చేశారు. విజయవాడ బయలుదేరి వెళ్లిన 24 మంది ఎంపీటీసీలలో చింతపల్లి వైస్ ఎంపీపీలు గోపి నాయక శారద, సాగిన వెంగళరావులు కూడా ఉన్నారు.

వరద బాధితులను సీపీఐ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డీ గూడెం గ్రామంలో వరద బాధితులను మంగళవారం సిపిఐ నాయకులు పరామర్శించారు. వరద బాధితులను వారి సమస్యలను, ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందాయా... లేదా? అని వరద బాధిత గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు విష్ణుమూర్తి, డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు కూనవరం మండల సెక్రెటరీ లంబు శీను వి.ఆర్.పురం సెక్రటరీ ఏసు (రాంబాబు) సహాయ కార్యదర్శి కామేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : అల్లూరి సీతారామరాజు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి ఎటపాక మండలంలోని గన్నవరంలో గోదావరి వరదలకు దెబ్బతిన్న ఇళ్ళను పరిశీలించారు. క్రిష్ణవరం పంచాయతీ లోని భూపతిరావుపేటలో సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యుడు సోయం కామేశ్వరరావు మాట్లాడుతూ తమ పంచాయతీలో పశువులు వున్నవారికి దాణా బస్తాలు అందరికీ ఇవ్వలేదని తక్షణమే అందరికీ దాణా బస్తాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంటే రాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, మండల కార్యదర్శి ఎలిశాల కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ పసుపులేటి ముత్తయ్య, సోయం కాసులు, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాలు మంజూరు చేయండి

విశాలాంధ్ర-అనంతగిరి... మండలంలో గల పాడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని మంగళవారం దేవరపల్లి యూకో బ్యాంక్ అధికారులను కోరడం జరిగిందని కాశీపట్నం పశువైద్యాధికారి గణేశ్వర రావు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మార్చి నెలలో పశుపోషకుల దరఖాస్తులు రుణాలు మంజూరుకై బ్యాంకుకు సమర్పించడం జరిగిందని కానీ నేటికీ ఒక్కరికి కూడా రుణం మంజూరు కానందున మరల బ్యాంక్ అధికారులు కలిసి పాడి మరియు సన్న జీవాల మీద ఆధారపడిన పశుపోషకులకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలనీ కోరడమైనదినీ ముఖ్యంగా ప్రధానమంత్రి పశు కిషన్ క్రెడిట్ కార్డ్ లు ద్వారా పశుపోషకులకు రుణాలు మంజూరు చేయవలసి ఉన్నదని ఔత్సాహిక పాడి రైతులకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేసేదిశగా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకొని పశుపోషకుల ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించాలని కోరడం జరిగిందని పశువైద్యాధికారి గణేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పినకోట గ్రామీణ పశు వైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి సుధావాణి పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం : కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లాలో సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం తరుపున అన్ని రకాల ప్రోత్సాహాన్ని అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన మరియు ఇతర పంటలు సాగు చేసే రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలయిన డ్రిప్, స్ప్రింక్లర్ లు రాయితీ పై ఇవ్వడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా ఈ 2024-25 ఆర్థిక సంవత్సరములో జిల్లా కు 1500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేయడానికి భౌతిక లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. 5 ఎకరాలలోపు భూమి గల రైతులకు 90% రాయితీపై డ్రిప్ పరికరాలు, 55 % రాయితీపై స్ప్రింక్లర్ పరికరాలు, 5 ఎకరాల పైబడి భూమి గల రైతులకు 50% రాయితీపై డ్రిప్ పరికరాలు, 45 % రాయితీ పై స్ప్రింక్లర్ పరికరాలు సరఫరా చేయబడునని, ఈ అవకాశాన్ని ఆయా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. భోరు, బావి ఉన్న రైతులు తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు, అధిక నికర ఆదాయం సాదించడానికి సూక్ష్మ సేద్యం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బిందు, సూక్ష్మ సేద్యం చేయదలచిన జిల్లా రైతులు ఆధార్, సాగు భూమికి సంబంధించి 1%దీ%, బ్యాంకు పాసు బుక్ ప్రతులు, ఫోన్ నెంబర్ తదితర వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను గానీ మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ లేదా ఉద్యాన అధికారిని గానీ కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా ఏడు సంవత్సరాల క్రితం సూక్ష్మ సేద్యం పరికరాలు రాయితీ పై తీసుకున్న రైతులు కూడా ఈ సంవత్సరము రాయితీ పొందడానికి అర్హులని తెలిపారు. ఈ పథకం పై మరిన్ని వివరాల కొరకు జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ శ్రీ. యం.ఎ. రహీంను 7995087036 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని వివరించారు.

జీఓ నెంబర్-3, స్పెషల్ డీఎస్సీపై స్పష్టతనివ్వాలి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు జీఓ నెంబర్ 3పై చట్టబద్ధత కల్పించడంతోపాటు, గిరిజన ప్రత్యేక డీఎస్సి పై స్పష్టతనిచ్చి ప్రకటించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివాసి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గిరిజన విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో సతశాతం ఉద్యోగాలు ఆదివాసి గిరిజనులకే కల్పించాలని గతంలో జీవో నెంబర్ 3 ను ప్రభుత్వం కల్పించిందన్నారు. అయితే ఆ జీవోను తొలగించడం వల్ల ప్రస్తుతం చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దకడం లేదన్నారు. ఈ జీవోను పునరుద్ధరించకుండా డీఎస్సీ భర్తీ చేయడం గిరిజనులకు ఎటువంటి ఉపయోగం లేదని, దీంతో వెంటనే ప్రభుత్వం గిరిజన స్పెషల్ డిఎస్సి ని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు కూడా మౌలిక సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు సరిపడే విధంగా ఉపాధ్యాయులను, అధ్యాపక సిబ్బందిని కూడా నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పి మత్తు, పి కుమారి, గిరిజనులు, కళాశాల గిరి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జామిగూడ-గుంజీవాడ వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చెయ్యాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పెదబయలు : అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జామిగూడ పంచాయితి జామిగూడ గుంజివాడ మధ్య వంతెన నిర్మాణం పూర్తి చేసి జామీగూడ, గిన్నెలకోట, ఇంజేరి పంచాయితిలకి చెందిన 80 గ్రామ ఆదివాసీలకు రవాణా సాదుపాయం కల్పించాలని వర్షాకాలంలో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి మనుష్యులు గెడ్డ దాటుటకు ఏర్పాటు చెయ్యాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులు గ్రామస్తులతో మంగళవారం జామిగూడ గెడ్డ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర మాట్లాడుతూ గుంజివాడ జామిగూడ వంతెన నిర్మాణం పూర్తి చేసి 80 గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు 2022లోని అప్పటి వైసిపి ప్రభుత్వం 2 కోట్లతో వంతెన నిర్మాణనికి శంకుస్థాపన చేసినప్పటికీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే చందంగా ఉందని నేటికీ రెండేళ్లు గడిచిన వంతెన నిర్మాణంలో పురోగతి లేదని ఆరోపించారు వర్షాకాలంలో ఆదివాసీలు పెన్షన్లు,నిత్యావసర వస్తువులు తీసుకుని వెళ్ళుటకు వంట పాత్రలతో సామాగ్రి నింపి గెడ్డ దాటుతున్నారని అనారోగ్యం వచ్చిన వృద్ధులు,గర్భిణీలు చిన్నారులు గడ్డాడటలేక ఆనపకాయ డిప్పల సాయంతో గెడ్డదాటి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా అధికారులు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు గత 20 రోజులుగా పలు దినపత్రికల్లో పలు కథనాలు వచ్చినప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం చూస్తుంటే గిరిజనులపై తమకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని మండిపడ్డారు ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే వంతెన నిర్మాణం పూర్తి చేసి గిరిజనులకు రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో గిరిజనులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు ఈకార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన దర్మన్న పడల్, జిల్లా మాజీ అధ్యక్షులు బొండ సన్నిబాబు రాష్ట్ర కమిటీ సభ్యులు కె నరసయ్య మండల నాయకులు పప్పుల బుజ్జిబాబు, జామిగుడా గ్రామస్తులు కొర్ర మంగ్లాన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-దేవీపట్నం : రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ మంగళవారం రంపచోడవరం, దేవీపట్నం మండలంలోని ఇందుకూరు డిఆర్ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెల తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరిగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరంలోని మండలస్థాయి స్టాక్ పైన్ను అదేవిధంగా మండలంలోని ఇందుకూరు పేట గ్రామంలోని రేషన్ షాపును పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రభుత్వ నిబంధన ప్రకారం తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ రేషన్ సరఫరా చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ సరఫరాలో ఎవరైనా నిర్లక్ష్యం వహించిన ఎడల తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. రేషన్ సరుకులు పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రేషన్ డిపో డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వెంట తహసిల్దార్ చలపతిరావు, డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణ జీసిసి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరిచే పార్టీగా సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్

విశాలాంధ్ర-బెలగాం : ప్రజలను చైతన్యపర్చే పార్టీగా సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. మంగళవారం సిపిఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక బెలగాం గిరిజన భవన్‌లో జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం ఎన్నో అరాచకాలు చేసిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్కరికి మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. పోరాటాలు చేసే వారిపై అనేక కేసులు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేసేంతవరకు సిపిఐ ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యకర్తలంతా నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజలకు పార్టీ గురించి చెప్పాలన్నారు. గ్రామ స్థాయిలో సిపిఐ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సుమారు 100 సంవత్సరాలు ఘన చరిత్ర గలిగిన సిపిఐ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం కేంద్రంలో బిజెపి వ్యవహరిస్తున్న తీరును ప్రజలందరికీ సిపిఐ పార్టీ కార్యకర్తలంతా తెలపాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్నటువంటి సిపిఐ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందడం బాధాకరమని అన్నారు. గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తలు, నాయకులంతా ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ అన్ని శాఖలను, సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఇక్కడి ప్రాంతాల్లోని భూపోరాటంలో సిపిఐ పార్టీ ప్రభావం ఎంతో ఉందన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో నవంబర్ 28, 29, 30 తేదీలలో ఎఐఎస్ఎఫ్ మహాసభలు జరుగునున్నాయని, దీనికి అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, పార్టీ శాఖల నాయకులు హాజరై విజయవంతం చేయవలసి నదిగా కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన సిపిఐ జెండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ఎగర వేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రానున్న కాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో సిపిఐ పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుని వలే కృషి చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవన్న మాట్లాడుతూ ఏనుగుల సమస్యపైన, రోడ్లు బాగులేవని, గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇళ్ల స్థలాలపైన సిపిఐ పార్టీ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం, వాటిపై పోరాటం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొచ్చ మోహనరావు, డి.హెచ్.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ జనార్దన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు, బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, కె. గోపి నాయుడు, జిల్లా సమితి సభ్యులు సాలాపు అనంతరావు, బి. బంగార్రాజు, సింహాద్రి దుర్గారావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవికుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు, పార్టీ నాయకులు గెంబలి శ్రీనివాసరావు, రాగోలు దుర్గా ప్రసాద్, గోవిందరావు, జె. నూకరాజు, జి. మోహన్ రావు, ఎ. అప్పారావు, ఆర్. ముత్యాలు, మహిళా సమాఖ్య నాయకులు చింతాడ అన్నపూర్ణ, నాగవంశం జానకమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమానికి సమిష్టిగా కృషి చేద్దాం : ఎమ్మెల్యే జగదీశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : మన్యంలో ఆదివాసీ లో అభివృద్ధి సంక్షేమం కోసం గిరిజన ప్రజా ప్రతినిధులు, సంఘాలు సమిష్టిగా కృషి చేద్దామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం బియ్యాలవలస పంచాయతీ దురిబిలిలో యస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలులో భాగంగా ఆదివాసీ హక్కులు, అవకాశాలపై చర్చా వేదిక బియ్యాల వలస సర్పంచ్ పువ్వుల అజారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యం ప్రజలు ఆహారం కోసం వినియోగించే చిరుధాన్యాలు,ఆకు, కూర గాయలు దుంపలు, అటవీ ఉత్పత్తులు, పురాతన పనిముట్లతో కూడిన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జగధీశ్వరి, గిరిజన నాయకులు స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం అమలులో నిర్లక్ష్యం, అటవీ ఉత్పత్తులు కు గిట్టుబాటు ధర లేకపోవడం, గిరిజన రైతాంగంపై ప్రభుత్వాలు ఉదాసీనత మొదలైన అంశాలపై చర్చించి తీర్మానించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనరాలిగా సమస్యలు అన్నీ తెలిసవేననీ సమస్యలు పరిష్కారం ఏ ఒక్కరి తో సాధ్యం కానిదైనందున గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి దేశాలు వారీగా పరిష్కారం చేసేందుకు ప్రయత్నిస్తా మని తెలిపారు. గిరిజన యువతకు విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అటవీ ఉత్పత్తులు కు గిట్టుబాటు ధర కల్పించేందుకు, సహజవనరుల సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసీ జెఎసి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోరిక లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం సమర్థవంతంగా అమలు చేసి సర్వ హక్కులు గిరిజనానికి చెందేలా చూడాలని ఆయన సూచించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, బిజేపి నాయకులు నిమ్మక సింహాచలం, మాజీ సర్పంచ్‌లు వెంపటాపు భారతి,మాసయ్య, తెలుగు దేశం మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, పువ్వుల పత్తి తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే మూల్యం చెల్లించక తప్పదు

- కొత్త వాహన చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి - జిల్లా రవాణా శాఖ అధికారి శశికుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : వాహనదారులు అలసత్వం వహిస్తే మూల్యం చెల్లించక తప్పదని, ప్రతీ వాహనదారుడు నూతన వాహన చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి యం.శశికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు నూతన వాహన చట్టాల పైన, రోడ్డు ప్రమాదాల పైన వాహన దారులకు, ప్రజలకు ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకపోవడం, సరైన వాహన పత్రాలు లేకపోవడం పైన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గడిచిన రెండేళ్లలో 18,138 వాహనాలను ప్రజలు కొనుగోలు చేశారన్నారు. జిల్లాలో ప్రతిరోజూ ప్రధాన రహదారిపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట గోరీలు, కొత్తవలస వై జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, పాత బస్టాండ్ వద్ద, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. ఈ క్రమంలో పెండింగ్ చలాన్లు చెల్లించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఈ-చలానా, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. గతంలో సీటు బెల్టు, హెల్మెట్ లేకపోతే వంద రూపాయలు చలానా ఉండేదని ఇప్పుడు అది 1000 రూపాయలుకు పెంచడంతోపాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయబడుతుందని, మద్యం సేవించి వాహనం నడిపితే పదివేల రూపాయలు అపరాద రుసుంతో పాటు కోర్టు విధించిన శిక్షకు అర్హులవుతారన్నారు. ఓవర్ స్పీడ్ తో వెళితే 2000 రూపాయలు అపరాధ రుసుము మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయబడుతుందని, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే ఐదు వేల రూపాయలు ఫైన్ విధించబడునని, త్రిబుల్ రైడింగ్ లో పట్టుబడితే 2000 రూపాయలు అపరాధ రుసుము కోర్టు విధించిన శిక్షకు అర్హులవుతారన్నారు. కావున ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రతా నియమాలు,నిబంధనలు పాటించాలని నూతన వాహన చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని లేకుంటే భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు.

ముఖ్యమంత్రి, ఉప-ముఖ్యమంత్రులతో కలెక్టర్, జిల్లా ఎస్పీలు ముఖాముఖి

విశాలాంధ్ర-పార్వతీపురం : సోమవారం నాడు అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కలెక్టర్, జిల్లా ఎస్పీలతో మొదటిసారిగా సమావేశం నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డిలు సమావేశంలో పాల్గొని, సమావేశ అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు పార్వతీపురం మన్యం జిల్లా గూర్చి వివరించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-కురుపాం : జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు గుమ్మలక్ష్మీపురం రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా హెలీ ప్యాడ్, సభా స్థలి ఇతర వసతులను కలెక్టర్ శ్యాంప్రసాద్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రస్తాకుంటుబాయి, మండ, గుమ్మలక్ష్మీపురంలో హెలీప్యాడ్ నిర్మాణం అక్కడ నుంచి సభా వేదికకు అతి తక్కువ సమయంలో చేరుకునే సౌకర్యాలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్, డిఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

విశాలాంధ్ర-కురుపాం : రాష్ట్రవ్యాప్తంగా అమలౌతున్న పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కురుపాం మహాత్మ గాంధీ జ్యోతిభా ఫూలే బిసి రెసిడెన్షియల్ పాఠశాలలో నేత్ర వైద్య సహాయకుడు రమేష్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అందత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి పరిశీలించి ప్రతీ విద్యార్థి కంటి పరీక్షలు చేసుకోవాలని సూచనలు చేశారు. దృష్టి దోషం వున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేస్తామని అలాగే నేత్రాలకు సంబంధించి ఎటువంటి శస్త్ర చికిత్సలు (మెల్లకన్ను, గాయాల వలన వచ్చే కేటరాక్ట్) అవసరమైతే వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : స్థానిక విజయరామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాల లో రహదారి భద్రతపై విద్యార్థులకు సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మంగమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ రహదారులపై ప్రయానిస్తూ జరుగుతున్న ప్రమాధాల గురించి, అలాగే మద్యం సేవించి వాహనం నడుపుతున్న వాహనచోదకుల గురించి రహదారి భద్రతపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం కార్లు మరియు ఇతర వాహనాలు నడిపే వ్యక్తులకు సీటు బెల్టు దరించడం వలన కలిగే ప్రయోజనాలపై అయన అవగాహన కల్పించారు. తరువాత గోల్డెన్ అవర్ గురించి గుడ్ సమరిటన్ గూర్చి అయన విద్యార్థు లకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డా. నారాయనరావు, కళాశాల సిబ్బంది, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల విద్యావనరుల కేంద్రానికి ఫ్యాన్‌లు వితరణ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న ఎ.పోలినాయుడు మండల విద్యా వనరుల కేంద్రానికి మూడు సీలింగ్ ఫ్యానులను వితరణగా అందజేశారు. గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొన్న మాస్టారు కృషిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి. సూరిదేముడు, ఎం.వెంకట రమణ, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు బి. ప్రసాదరావు, ఎస్టియు అధ్యక్షులు ఏ.మోహన్‌రావు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కూర్మినాయుడు పి ఆర్ టి యు నాయకులు కె.అప్పుడు దొర, బి. రవికుమార్ లతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

పాలిచ్చే తల్లులందరికీ మద్దతు ప్రకటిద్దాం
నేడు అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవం

విశాలాంధ్ర-చింతపల్లి : మాతా శిశువుల ఆరోగ్యం కోసం పాలిచ్చే తల్లులందరికీ మద్దతు ప్రకటిద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బెన్నవరం సెక్టార్ పరిధిలో బెన్నవరం అంగన్వాడీ కేంద్రంలో ఆ అంగన్వాడి కార్యకర్త ఎం.మచ్చకొండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆమెతో పాటు లోతుగెడ్డ వైద్యాధికారి లక్ష్మీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆ సెక్టార్ పరిధిలోని ఎనిమిది మంది గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిపాలు శిశువులకు మొదటి టీకా అన్నారు. శిశువు జన్మించిన వెంటనే తల్లి పాలు త్రాగడం వలన జీవితకాల వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. ఏ నెలకు ఆ నెల వైద్య చికిత్సలు అందించడంతోపాటు ఆసుపత్రులలో సుఖప్రసవం నిర్వహించుకోవడం వలన మాత శిశు మరణాలు లేకుండా చూడవచ్చన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి రమ్యశ్రీ,, ఏఎన్ఎం కళ్యాణి, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ఆగస్ట్ 1 నుండి7 వరకు చేయడం జరుగుతుంది. అందులో భాగంగా

ఈరోజు మక్కువ 4 అంగన్వాడీ సెంటర్ లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పుట్టిన గంటలోపు బిడ్డ కి తల్లి పాలు పట్టడం వలన కలిగే ప్రయోజనాల కోసం గర్భిణీ, బాలింతలకి వివరించడం జరిగింది. అలాగే బిడ్డకి 6 నెలలు పూర్తి అయ్యే వరకు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని ఇతర ఎలాంటి పానీయాలు పెట్టకూడదని తెలియజేయడం జరిగింది. తల్లి పాలు ఆవశ్యకత కోసం తల్లులకి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్కువ సూపర్‌వైజర్ పి.రాజశ్రీ, మహిళ పోలీస్ లావణ్య మరియు మక్కువ 1, 2 సచివలయాల యొక్క అంగన్వాడీ వర్కర్స్ మరియు గ్రామంలో గర్భిణీ బాలింతలు తల్లులు అటెండ్ అయ్యారు.

బెలగాం : అంతర్జాతీయ తల్లి పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేసామని స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఉదయం 11 గం.లకు కార్యక్రమం ప్రారంభమౌతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహహింస నుండి మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

మారేడుమిల్లి : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా

మండలంలో చట్లవాడ గ్రామంలో స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బాలింలు, గర్భిణీ స్త్రీలు చంటిపిల్లలు తల్లులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది తల్లి పాలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై అవగాహనా కల్పించారు.మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని గర్భిణీలు ఎప్పుడికప్పుడు తాజా ఆహారం తీసుకోవాలని, శిశువుకి మూర్రుపాలే మొదటి టీకాలని సలహాలు సూసచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రసూనా, సరోజినీ, రాములమ్మ, ప్రేమమణి, మంగమ్మ, బాలమ్మ, రూపావతి పాల్గొన్నారు.

అనంతగిరి : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అనంతగిరి పీహెచ్సీ వైద్యాధికారిని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది సికిల్‌సెల్ ఎనీమియా గురించి స్లోగన్స్ చేస్తూ అనంతగిరి పిహెచ్సి నుంచి ప్రధాన రహదారిలో మానహహారం చేసి వ్యాధిపై అవగాహన కల్పించారు. పిఓ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో పాడేరు పరిధిలోగల పిహెచ్సిలో కళాజాతర ప్రదర్శన నిర్వహిస్తున్నారని అందులో భాగంగా మన పెద్దూరు అనంతగిరిలో కళాజాత నిర్వహించడం జరిగిందని పీహెచ్ వైద్యాధికా జ్ఞానేశ్వరి తెలిపారు ఈ ప్రదర్శనలో సికిల్

సెల్ ఎనీమియా ఏవిధంగా వస్తుంది వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అమౌంట్ తప్పకుండా మందులు వాడాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు డెంగ్యూ చికెన్ గున్యా మలేరియా మెదడు వ్యాధులు గురించి దోమల నుండి ఏవిధంగా రక్షించుకోవాలి దోమలు కొట్టుకుంటా దోమతెరలు వాడాలని ఈ కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ప్రధాన వైద్యాధికారి జ్ఞానేశ్వరి ఎంపీహెచ్వో నర్సింగరావు పీహెచ్ ఎన్ బాలమ్మ ఏఎన్ఎంలు అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీతంపేట: మండలం పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి. రంగలక్ష్మి తెలిపారు. తల్లిపాలు పుట్టిన బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని అవగాహన కల్పించారు. అనంతరం పెదరామ క్లస్టర్లో ఎంపీడీవో గీతాంజలి ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు తల్లులతో దీపాలను వెలిగించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు రవీంద్ర, చాందిని, ఐసిడిఎస్ సూపర్వైజర్లు లావణ్య, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోలికి పోయి... గ్రామాలకు చెడ్డపేరు తేకండి

తహసీల్దార్ రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : గంజాయి జోలికి పోకండి.. గ్రామాలకు చెడ్డపేరు తేకండి అంటూ వివిధ శాఖల అధికారులు, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తల చేత తహసిల్దార్ రామకృష్ణ ప్రమాణం చేయించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా హాజరైన ఆయన అక్కడికి విచ్చేసిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్, వైద్య, పంచాయతీ తదితర శాఖల అధికారులు, అంగన్వాడి కార్యకర్తలతో గంజాయి సాగు, రవాణాల నిర్మూలనపై తమ గ్రామాలలో, తమ పరిసరాలలో గంజాయి సాగు, రవాణాలు లేకుండా చూస్తామని, అదే క్రమంలో గంజాయి కొనుగోలుకై ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి తమ గ్రామాలకు వచ్చే నూతన వ్యక్తుల పట్ల అప్రమత్తతతో ఉండడమే గాక వారు చేసే కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి గంజాయి నిర్మూలనలో తాము కూడా భాగస్వాములు అవుతామని వారందరి చేత తహసీల్దార్ రామకృష్ణ ప్రమాణం చేయించారు.

ఐటీడీఏ ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం ఐటిడిఏ. పరిదిలోగల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఐటిడిఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ప్రోజెక్టు అధికారి ఎస్.సేధుమాధవన్ పర్యవేక్షణలో అధికారులు కౌన్సిలింగు నిర్వహించారు. కౌన్సిలింగులో ఉపాధ్యాయులు ఎంచుకున్న ఐచ్ఛికాల ప్రకారం బదిలీలు చేపట్టారు. మొత్తం 76 మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగుకు హాజరయ్యారు.బదిలీఅయిన స్థానాలలో వెంటనే జాయిను కావాలని కోరారు.పారదర్శకంగా ఉపాధ్యాయులు కోరిన స్థానాలకు బదిలీ చేయుట జరిగిందని, ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రోజెక్టు అధికారి తెలిపారు. కౌన్సిలింగు కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు రుక్మాంగధయ్య, ఐటిడిఏ డిప్యూటీ డిఇఒ సుగుణ, పి.ఎం.ఆర్.సి. ఎఎంఒ రాయుడు, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుస బొజ్జయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర-పాడేరు : బీజేపీ గిరిజన మోర్చా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కురుస బొజ్జయ్య 5వ వర్ధంతి సందర్భంగా కొత్త పాడేరులోని అయన విగ్రహానికి మంగళవారం కుటుంబ సభ్యులు, బీజేపీ పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అయన బీజేపీ పార్టీకీ, గిరిజన ప్రాంతానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. బీజేపీ పార్టీ నీ గిరిజన ప్రాంతంలో విస్తరణ చెయ్యటానికి, అలాగే కేంద్ర కాఫీ బోర్డు సభ్యులుగా అయన ఉన్న సమయంలో కాఫీ ప్లాంటేషన్ అభివృద్ధికి విశేషా కృషి చేసారన్నారు.అతని సారధ్యంలో పార్టీలో చేరిన అనేకమంది కార్యకర్తలు నేడు క్రియా శీలంగా పార్టీలో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుస ఉమా మహేశ్వరరావు, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కురుస పార్వతమ్మ, జనసేన పార్టీ అధికార ప్రతినీది బొంకుల దివ్య లత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామకృష్ణ, పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడ కృష్ణ రావు, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, బీజేపీ నాయకులు వంతల రామ్ చందర్, గోపాల పాత్రుడు, నందోలి ఉమా మహేష్, కీల్లో ఆనంద్, కొట్నాపల్లి ఏంపిటీసి బాలకృష్ణ, పాంగి మత్స్య కొండబాబు, కురుస రాజారావు, పాంగి రవిచంద్ర, పాపిటి రాజు, కుటుంబసభ్యులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన గ్రామాలను ఎంపీపీ పరిశీలన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: ఇటీవల సంభవించిన శబరి గోదావరి వరదలకు ముంపుకు గురైన మండలంలోని కోటారి గొమ్ము, జీడిగుప్ప, సీతంపేట, శ్రీరామ్ గిరి, ముల్కసపల్లి, చొక్కానపల్లి, గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మితోపాటు సిపిఎం బృందం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ. వరదలకు అనేక గ్రామాలు మునగటంతో గ్రామాల్లోని డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్, కాళ్ల వాపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇద్దరు ముగ్గురు మరణించడం జరిగిందని తక్షణమే వైద్య అధికారులు స్పందించి సహాయ చర్యలు చేపట్టాలని హెల్త్ క్యాంపులు తక్షణమే నిర్వహించాలని అలాగే వరదల్లో గృహాలు 15 రోజులుగా కొన్ని గ్రామాల్లో గృహాలు పడిపోయా యని పూర్తిగా డ్యామేజ్ అయిన గృహాలకు రెండు లక్షల రూపాయలు నష్టపరిహారం ఆఫ్ డామేజ్ గృహాలకు లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని వరదల కారణంగా పశువులు మేకలు గొర్రెలు వ్యాధులకు గురై మరణిస్తున్నా యని వెటర్నరీ అధికారులు స్పందించి తక్షణమే హెల్త్ క్యాంపులు పెట్టించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మండల నాయకులు కారం. సుందరయ్య సోడి. మల్లయ్య, తోడం రాజు, గొంది.దారయ్య, ఏ.కాంతారావు, జి.లక్ష్మణరావు, తాతబాబురెడ్డి, ఎస్.రాజు, బాబురావు, మాజీ సర్పంచ్ బూబమ్మ, సున్నం సీతమ్మ వార్డు నెంబర్, చంద్రరావు, టి.నాగేశ్వరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య



విశాలాంధ్ర-వై.రామవరం : అల్లూరి జిల్లా వై.రామవరం మండలం యర్రంరెడ్డి పాలెం పంచాయతీ గండెంపల్లికి చెందిన నెరం సంతోష్ కుమార్ అనే 18 ఏళ్ల గిరిజన యువకుడు గడ్డి మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. ఈనెల 4న ఇంటి వద్ద తన కుమారుడు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నదని తల్లి మందలించడంతో మనస్తా పానికి గురై గడ్డి మందు సేవించాడని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని తెలి పారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామ న్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8న ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : మండలంలోని డోకిశీల గ్రామంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం, క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమ్యూనిటీ పారామెడిక్స్ &ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ జిల్లా యూనియన్ అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం తెలిపారు. ఈకార్యక్రమం శ్రీకాకుళం జిల్లా రాగోలువద్ద ఉన్న జేమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర హాజరవుతారన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఎముకలు కీళు చెవి ముక్కు గొంతు కన్ను అన్నిరకాల సాధారణ వ్యాధులకు అనుభవజ్ఞులైన వైద్యులచే తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కావున సమీప ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, జాయింట్ సెక్రెటరీ బివి రమణ ఉన్నారు.

ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున జి.ఓ నెంబర్ 3పై ప్రభుత్వం స్పష్టతను తెలియచేయాలి

- ఆగస్టు 9ని సెలవు దినంగా ప్రకటించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-చింతూరు : ఈనెల 9వ తేదిన జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున జి. ఓ నెంబర్ 3 పై మరియు ఏజెన్సీలో ఆదివాసి రిజర్వేషన్ల పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను తెలియచేయాలని, అదేవిధంగా ఆగస్టు 9న సెలవు దినంగా ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరులో జరిగిన ఆదివాసి గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆదివాసీలకి ఒరిగింది ఏమీ లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైన ఆదివాసీల హక్కులు చట్టాలను కాపాడాలని ఆదివాసి నిరుద్యోగ యువతకు కీలకమైన జీవో నెంబర్ 3ను రద్దు చేయడం అంటే

వారి అభివృద్ధిని విస్మరించడమేనని, ఆదివాసి దినోత్సవం రోజునైనా రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టతను తెలియజేయాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టాన్ని అమలు చేయాలని అన్ని గ్రామాల్లో పిసా కమిటీలు ఏర్పాటుచేయాలని అదేవిధంగా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి భూమిలేని గిరిజన నిరుపేదలకు భూమి ఇవ్వాలని పెండింగ్లో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా నాణ్యమైన విద్య మెరుగైన వైద్యం ఆదివాసులకి అందించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి దినోత్సవం కాబట్టి ఆ ఒక్క రోజున తూతూ మంత్రంగా ఆదివాసితో సభలు పెట్టడంతో ప్రభుత్వం సరిపెట్టుకుంటే ఆదివాసులకు ప్రయోజనం ఏమీ ఉండదని ఆదివాసి ప్రజలు అభివృద్ధికి దోహదపడే జీవోలను చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ వీరబోయిన దిలీప్ నాగార్జున్ సుబ్బారావు లక్ష్మణ్ తమ్మయ్య బాబురావు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు హక్కులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మన్యంలో నివసించే ప్రజలు ప్రభుత్వం వారికోసం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్ బాబు తెలిపారు. మంగళవారం రాజవొమ్మంగి మండలం అమినాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగం కల్పించిన విధి విధానాలను తెలుసుకోవాలని, న్యాయ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని పేద ప్రజలందరు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది. కెవెన్వి రమణ, సోషల్ వర్కర్ గౌరిశంకర్, జడ్డంగి ఎస్సై రఘునాదరవు, సర్పంచ్ కించు వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ, పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు వారికి ఆసక్తి ఉన్న కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి సమాచారం సేకరించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా క్యూఆర్ కోడ్ రూపొందించడం జరిగిందని, క్యూఆర్ కోడ్ ఓపెన్ చేయగానే వచ్చే లింకును క్లిక్ చేస్తే గూగుల్‌లో దరఖాస్తు ఓపెన్ అవుతుందని, అందులో మీ సమాచారాన్ని పూర్తిగా నింపి, మీకు నచ్చిన కోర్సుని ఎన్నుకొని ఆ దరఖాస్తుని సబ్మిట్ చేయాలి. ఆ డేటా ఆధారంగా ఎక్కువ మంది యువతచే ఎన్నుకోబడిన కోర్సుపై శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడం జరుగుతుందని పీవో తెలిపారు. సీతంపేట, ఐటిడిఏ వెబ్ సైట్ https://ITDASEETHAMPETA.AP.GOV.INలో కూడా ఈ లింక్ ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. పూర్తి వివరాలకు సీతంపేట లివైటీసీ మేనేజర్ బి.వెంకటరమణ (7032060773)ను సంప్రదించాలని సూచించారు. క్రింద ఇచ్చిన లింక్ ద్వారా యువత తమ డేటాను సమర్పించాలని పీవో తెలిపారు.

పాముకాటుకు గిరిజనుడు మృతి

విశాలాంధ్ర-చింతూరు : మండలంలోని ఏజి కోడేరు గ్రామానికి చెందిన మోసం తమ్మయ్య (76)ను ఈరోజు ఉదయం 6 గంటలకు తాచు పాము కరిసింది. మోసం తమ్మయ్యను వెంటనే చింతూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకురాగా ట్రీట్మెంట్ చేస్తూ ఉండగానే మృతి చెందారు.

గవర్నర్ సెక్రెటరీను కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల నేతలు

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవాసంస్థల సమాఖ్యసభ్యులు రాజ్ భవన్‌లోని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సెక్రెటరీ, డాక్టర్ ఎం.హరిజవహార్ లాల్‌ని కలిశారు. స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవా సంస్థలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, అలాగే రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించేలా చొరవ తీసుకోవాలన్నారు. యువత, పర్యావరణ పరిరక్షణకు, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య సెక్రెటరీ అధ్యక్షులు పివిరమణయ్య, రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల సమాఖ్య సెక్రటరీ పి. ప్రకాష్(పార్వతీపురం ఐ ఆర్ పిడబ్ల్యుఏ సంస్థ అధినేత) రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అడ్వైజర్, మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

తల్లిపాలు శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది

విశాలాంధ్ర-సీలేరు : తల్లిపాలు శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందని జీకేవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే.హిమబిందు అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఈ పాలు శిశువుల్లో వ్యాధి నిరోధక టీకా మాదిరిగా పనిచేస్తుందని ఆమె తెలిపారు. శిశువులకు పూర్తిస్థాయిలో పాలు పెట్టాలంటే తల్లి పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆకుకూరలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు క్రమంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న టేక్ హెూమ్ రేషన్ గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిశువులకు క్రమంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆమె తెలిపారు. శిశువుల ఆరోగ్యంపై తల్లులు అశ్రద్ధ చేయరాదని, వ్యాధి లక్షణాలు కనిపించడం వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని వచ్చి మెరుగైన చికిత్స అందించాలన్నారు. శిశువులకు నాటు వైద్యం, పసరు మందులు పట్టరాదని ఆమె తెలిపారు. గర్భిణీలు ఆసుపత్రిలో మాత్రమే ప్రసవం పొందాలని, ప్రసవ సమయానికి ఐదు రోజులు ముందుగా ఆసుపత్రిలో చేరాలని ఆమె తెలిపారు. గఅహంలో ప్రసవం పొందడం వల్ల మాతా శిశు మరణాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దారకొండ సర్పంచ్ రాజు, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులు బుజ్జి, పిహెచ్ఎన్ రాణి, ఎంపీహెచ్ఈఓ పోతురాజు, ఎంఎల్‌హెచ్‌పి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

బిజేపి ఆధ్వర్యంలో ఐటిడిఏ పిఓకు వినతి

విశాలాంధ్ర-చింతూరు : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా రైతు సంఘం ఆధ్వర్యంలో విలీన మండలాలలో రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చింతూరు ఐటిడిఏ పిఓకి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నోముల రామారావు రాష్ట్ర కీషాన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోర్లా ప్రసాద్ నాయకత్వంలో వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిపత్రంలో ప్రధానంగా బ్యాంకు రుణాలు రైతాంగానికి అందించాలి. పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలి. నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని రైతు గిడ్డంగులు నిర్మించి మార్కెట్ ధరలు అందించాలని పాడి పరిశ్రమ అభివృద్ధికి పాల కేంద్రం నిర్మించాలని పాడైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును పునర్దించాలని మెట్ట పంటలు అభివృద్ధిని ఆదుకోవాలని తోటపల్లి నాగార్జున బ్యాంకులో కిసాన్ సమన్ నిధులు బ్యాంక్ అప్పులకు జమయటం ఆపాలని కోరుతూ పిఓ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకయ్య, నోముల సత్తిబాబు, డివిఎస్ రమణారెడ్డి, మోడుకు పెరమయ్య కరక పవన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవుల అక్రమంగా తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర-వై.రామవరం : అల్లూరి జిల్లా వై.రామవరం మండలం నుండి అవులు అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. వీరిలో వ్యాను డ్రైవర్ మామిడి పవన్ కుమార్ కృష్ణునిపాలెం, మేకా శ్రీను చిన చీడిపాలెం, శాసుం రాఘవరావు దారకొండ ప్రాంతానికి చెందిన వారన్నారు. పట్టుకున్న ఆవులు, ఎద్దులను ఉలిగోగుల గోసంరక్షణ సమితికి తరలించినట్టు చెప్పారు.

రేషన్ డిపోను తహసిల్దారు తనిఖీ

విశాలాంధ్ర-గంగవరం : రేషన్ డిపోలో తనిఖీలో భాగంగా మంగళవారం పి గార్లపాడు లోని రేషన్ డిపోను తహసిల్దార్ సత్య సులోచన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డిపోలోని స్టాకును పరిశీలించారు. అలాగే రికార్డులను పరిశీలించారు. రేషన్ ఎటువంటి అవకతవకలకు పాల్పడరాదని ఆమె సూచించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ జిలాని పాల్గొన్నారు.

ఎంపిపి పాఠశాలను ఐఈ, ఏఎంఓ కోఆర్డినేటర్‌లు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : స్థానిక మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా ఐఈ, ఏఎంఓ కోఆర్డినేటర్ కొమ్ము భాస్కరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం దివ్యాంగుల విద్య కోసం ఏర్పాటుచేసిన భవిత సెంటర్‌ను సందర్శించి కొద్దిసేపుపిల్లలతో మాట్లాడారు. అనంతరం రికార్డు పరిశీలించారు. ఐఈ ఆర్‌టి టీచర్స్‌కు పిల్లలు అభివృద్ధి కొరకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. పాఠశాలలోజరుగుతున్న డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యా ప్రవేశ 90 డేస్ ప్రోగ్రాంను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలపై అభినందించ డం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు అందాల వీణాదేవి, ఐఈ ఆర్‌టి, టీచర్స్ తిత్తి చిన్న బాబు, జ్యోత్స్న, పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధ్యతగా విద్యాబోధన చేయాలి ఎంఈఓ సుందర్‌రావు

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : గిరిజన విద్యార్థి, విద్యార్థులకు విద్యాబోధనలు ఉపాధ్యాయులు బాధ్యతగా అందించాలని, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎస్. సుందర్‌రావు చెప్పారు. ఇక్కడి మండలంలోని కించమండ పంచాయతీ కోసోంగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులచే ఆంగ్ల పదాలు వాక్యాలను చదివించారు. మండల విద్యాశాఖ అధికారి అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఎటువంటి తడబాటు లేకుండా సమాధానం చెప్పడంతో ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించే విద్యాబోధన కష్టంతో కూడినది కాకుండా... ఇష్టంగా విద్యా పాఠ్యాంశాలు అందించినప్పుడే విద్యార్థులు అలవర్చుకోగలరని ఆయన సూచించారు. అనంతరం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విలియం కేరిని ఎంఈఓ అభినందించారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా కొండలపై ఎటువంటి అక్రమ తవ్వకాలు జరిపిన తగు చర్యలు తప్పవని జిల్లా గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. భామిని మండలంలోని పసుకుడి గ్రామ సమీపంలో ఉన్న కొండ వద్ద అక్రమంగా గ్రావెల్ తరలించుచున్న నాలుగు ట్రాక్టర్లను గుర్తించి వారి నుండి రూ.6,930/-అపరాధ రుసుము వసూలు చేయడం జరిగిందని, ఆ గ్రామ పరిధిలో ఎవ్వరూ ఎటువంటి అక్రమ ఖనిజాల తవ్వకాలు చేపట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ రెవిన్యూ అధికారిని కోరామని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపితే వెంటనే మండల తహసీల్దార్ కు తెలియజేయాలని విఆర్ఓకు సూచనలు ఇచ్చామని ఆప్రకటనలో వివరించారు.